

మద్దతు ధరతో జొన్న, రాగి, కొనుగోలు : కలెక్టర్

దానిమ్మ రైతుకు లాభాల పంట 9

మంత్రివర్గ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్





- ఢిల్లీలో రాహుల్‌తో సీఎం భేటీ
- డీసీఎం లేకుండానే ముగిసిన సమావేశం

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రెండు వారాల క్రిందటే సీఎం సిద్దరామయ్య 15న శనివారం ఢిల్లీ వెళ్తానని అందుబాటులో ఉంటే అగ్రనేతలతో కలుస్తానని ప్రకటించిన విషయం తెలిసిందే. బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా కూటమి ఘోర పరాజయం పొందిన కొన్ని గంటల్లోనే రాహుల్‌గాంధీ కర్ణాటక రాజకీయాలపై స్పందించారు. శనివారం సాయంత్రం ఢిల్లీలోని నివాసంలో రాహుల్‌గాంధీని సీఎం సిద్దరామయ్య భేటీ అయ్యారు. ఇద్దరి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చాయి. క్యాబినెట్ విస్తరణ ప్రస్తావించగానే గో అహెడ్ అంటూ రాహుల్‌గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాసేపట్లోనే సీఎం సిద్దరామయ్య రాహుల్ నివాసం నుంచి బయటకు వచ్చారు. వాస్తవానికి కాంగ్రెస్ అగ్రనేత, సుప్రీం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌కు సంబంధించిన పుస్తకావిష్కరణలో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లారు. మధ్యాహ్నం లోగానే ముఖ్యమంత్రి ఢిల్లీకి చేరుకున్నారు. అంతలోనే రాహుల్ గాంధీ అందుబాటులో ఉండడంతో చర్చలు ముగిశాయి. కానీ డీసీఎం డీకే శివకుమార్ 4 గంటల తర్వాత ఢిల్లీకి చేరారు. ఈలోగానే సీఎం, రాహుల్‌తో చర్చలు ముగించడం విశేషం.

- సీఎం ఢిల్లీ పర్యటనకు మంత్రులు మహదేవప్ప, భైరతి సురేశ్‌లు కలసి వెళ్లారు. అప్పటికే ఢిల్లీలో మంత్రులు జార్జ్, జమీర్ అహ్మద్, ఎంసీ సుధాకర్, ఎమ్మెల్యే పొన్నణ్ణలు చేరుకున్నారు. కానీ రాహుల్‌ను కలసిన వేళ సీఎం సిద్దరామయ్య ఒక్కరు మాత్రమే వెళ్లారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఆయనతో ఉన్నారు.

డీసీఎం డీకే శివకుమార్ లేకుండానే...



మేమిద్దరం కలిసే ఉన్నామని, మామధ్య విబేధాలు లేవని, కలిసే ప్రభుత్వం, రాజకీయాలు చేస్తున్నామని డీసీఎం డికే శివకుమార్ పలు సందర్భాల్లో సీఎం వ్యాఖ్యానించడం తెలిసిందే. కానీ శనివారం ఎవరికి వారు వేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. డీసీఎం డీకే శివకుమార్ లేకుండానే సీఎం, రాహుల్‌గాంధీతో భేటీ అయ్యారు. అంతలోనే విస్తరణకు అనుమతులు పొందారు. పరోక్షంగా డీసీఎంకు ఈ ప్రక్రియ కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. కానీ సోమవారం ఇద్దరూ కలసి వస్తారా... లేదా అనే కొత్త చర్చ జోరందుకుంది.

రేపు మరోసారి ఢిల్లీకి సీఎం



మంత్రివర్గ విస్తరణకు రాహుల్‌గాంధీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. క్యాబినెట్ నుంచి ఎవరిని తొలగించాలి, ఎవరిని, ఎంతమందిని తొలగించాలనే చర్చలు జరగాల్సి ఉంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో చర్చించాలని రాహుల్‌గాంధీ సూచించారు. దీంతో సోమవారం సీఎం ఢిల్లీ వెళ్లనున్నారు. అదే రోజున సాయంత్ర 5గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని సీఎం సిద్దరామయ్య కలుస్తారు. చెరకుకు గిట్టుబాటుధర విషయంతోపాటు రాష్ట్రానికి రావాల్సిన పలు గ్రాంట్ల అంశం కూడా చర్చించే అవకాశం ఉంది. ఈలోగా అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో చర్చలు జరిపి మంత్రివర్గ విస్తరణకు పేర్లు ముహూర్తం ఖరారు చేసుకోనున్నారు. కాగా ఎంతమందిని తొలగిస్తారనేది క్లిష్టం అవుతుండగా కొత్తగా క్యాబినెట్‌లోకి చోటుకోసం ప్రయత్నిస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. వీరిలో బేళూరు గోపాలకృష్ణ, ఎం కృష్ణప్ప, మాగడి బాలకృష్ణ, రిజ్వాన్ అర్షద్, రూపకళ శశిధర్, మాలూరు నంజేగౌడ, శివలింగేగౌడ, హ్యారిస్, పొన్నణ్ణ, సలీం అహ్మద్, బీకే సంగమేశ్‌ల పేర్లు ఉన్నాయి కానీ ఇప్పటికే సీఎం పలువురికి మాటీ ఇచ్చారు. వారిలో బీకే హరిప్రసాద్, లక్ష్మణసవది, నాగేంద్ర, ఆర్‌వీ దేశ్‌పాండేలు ఉన్నట్టు తెలుస్తోంది.



కళాగ్రామలో సాలుమరద తిమ్మక్కకు నివాళి అర్పిస్తున్న మంత్రులు పరమేశ్వర్, ఈశ్వర్ ఖండ్రే తదితరులు

పుడమితల్లి ఒడిలోకి వృక్షమాత

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



కుమారుడు ఉమేశ్‌కు జాతీయ పతాకాన్ని అందజేస్తున్న మంత్రి

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వృక్షమాత సాలుమరద తిమ్మక్క మట్టిలో లీనమయ్యారు. శనివారం బెంగళూరు కళాగ్రామలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. శుక్రవారం తుదిశ్వాసవీడిన సాలుమరద తిమ్మక్కకు ఆసుపత్రిలోనే సీఎం సిద్దరామయ్య కడపటి నివాళి అర్పించారు. శనివారం ఉదయం ఆమె భౌతికకాయాన్ని రవీంద్రకళాక్షేత్ర ప్రాంగణంలో ఉంచారు. పర్యావరణ ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, కులసంఘాల పెద్దలు నివాళులు అర్పించారు. రవీంద్రకళాక్షేత్ర నుంచి జ్ఞానభారతిలోని కళాగ్రామకు పార్థివదేహాన్ని తరలించారు. ప్రముఖ సాహితీవేత్త సిద్దలింగయ్య సమాధి పక్కనే గొయ్యి తవ్వారు. చివరిసారిగా హోం మంత్రి పరమేశ్వర్, అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రె తదితరులు పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ఖండ్రె మాట్లాడుతూ సాలుమరద తిమ్మక్క అనితర సాధ్యురాలన్నారు. కనీస చదువు లేకున్నా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొందారన్నారు. పద్మశ్రీ గౌరవం సాధించిన గొప్ప మహిళ అన్నారు. ఆమె 114ఏళ్లు జీవించారని, ఆమె గౌరవార్థం రాష్ట్రంలోని 114 ప్రాంతాలలో 114 మొక్కలు నాటుతామన్నారు. అనంతరం పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవవందనం సమర్పించారు. జాతీయజెండాను పోలీసులు హోం మంత్రి పరమేశ్వర్ ద్వారా తిమ్మక్క దత్తపుత్రుడు ఉమేశ్‌కు అప్పగించారు. ఈ సందర్భంలో ఉమేశ్ కంటతడిపెట్టారు. హిందూ సంప్రదాయ విధానాలతో అంత్యక్రియలను జరిపారు. కానీ హులికల్ గ్రామస్తులు మాత్రం సాలుమరద తిమ్మక్క అంత్యక్రియలు ఆమె జీవితంకాలం గడిపిన హులికల్‌లో జరిపింటే బాగుండేదన్నారు. కనీసం ఆమె స్మారకాన్ని అయినా హులికల్‌లో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

అడవిపై నిఘా

- వన్యప్రాణుల కదలికల పరిశీలనకు డ్రోన్‌లు
- మానవ సంఘర్షణ నియంత్రణకు 8 అంశాలు
- పల్లెలవైపు వచ్చే పులుల పట్టివేతకు ప్రత్యేక కార్యాచరణ
- అటవీశాఖ కీలక నిర్ణయాలు



వన్యప్రాణుల దాడిలో బలైన మనుషులు

2022-23	57	2024-25	46
2023-24	65	2025-26	32



బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధిక ఏనుగులు కల్గిన రాష్ట్రంగాను, పులులసంఖ్యలో రెండోదిగాను, చిరుతలు కల్గిన మూడో అతిపెద్ద రాష్ట్రంగా ఉండే రాష్ట్రంలో కొత్త భయం వెంటాడుతోంది. దేశంలోనే వన్యప్రాణులు మా రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నాయని గొప్పలకు పోవాలా... రాష్ట్రవ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో వన్యప్రాణుల దాడిలో వారానికి నలుగురైదుగురు బలి అవుతుండంపై అటవీ సమీప ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. గడిచిన నాలుగైదు ఏళ్లుగా వన్యప్రాణులతో మృతి చెందేవారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర పరిధిలోని ఆరేడు జిల్లాల్లో పశ్చిమకనుమలు విస్తరించి ఉన్నాయి. లక్షల హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయి. పైగా వర్షాకాలంలో నాలుగైదు నెలలు భారీ ప్రభావం మినహా ఏడాది పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణం ఉంది. లక్షల హెక్టార్లలో విస్తీర్ణం, ఆహ్లాదకర వాతావరణం ఉండడంతో వివిధ జాతుల వన్యప్రాణులు రాష్ట్రంలో నివసించేందుకు అనుకూలంగా ఉంది. శతాబ్దకాలంగా పరిశీలిస్తే పొరుగున ఉండే మహారాష్ట్ర మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలకంటే ఏనుగులు, పులులు, చిరుతలు, సింహాలు అధికంగా ఉన్నాయి. అటవీప్రాంతాల్లో ఆక్రమణలు, గనుల తవ్వకాలు, జంగిల్ రిసార్టుల ఏర్పాటు, విద్యుత్‌లైన్‌ల అమరిక వంటి పనులతో వన్యప్రాణులు జీవించే అడవిలోకి మానవప్రవేశం ఏటా పెరుగుతూ వస్తోంది. ఒకప్పుడు పగటి వేళల్లో మాత్రమే వాహనాల సంచారానికి అనువుగా ఉండే ఘాట్, అటవీప్రాంతాలో కొంత సమయం పెంచడం కూడా వన్యప్రాణుల జీవనానికి ఆటంకంగా మారుతోంది. ఈ ప్రభావంతో చిరుతలు, పులులు అటవీప్రాంతాలను వీడి జనసంచారం ఉండే పల్లె ప్రాంతాలవైపు వస్తున్నాయి. కుక్కలు, ఇతర పెంపుడు జంతువులను వేటాడేందుకు అలవాటు పడుతున్నాయి. ఇదే సమయంలోనే ఒంటరిగా పొలాల్లో పనిచేసుకునేవారు, గొర్రెల కాపరులు, పశువుల కాపరులపై దాడులు చేస్తున్నాయి.

సంఘర్షణలను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక

- మానవ, వన్యజీవి సంఘర్షణ ప్రదేశాలను గుర్తించి ఏ విధమైన రీతిలో సంఘర్షణ జరిగిందనేది ఓ నివేదిక తయారు చేయదలిచారు.
- మానవ వనరుల నిర్వహణ, సంఘర్షణ తీవ్రత ఆధారంగా అధికారులు, ఉద్యోగులను కేటాయించడం.
- అటవీప్రాంతాలకు అనుబంధంగా ఉండే గ్రామాలలో గస్తీ పెంచడం, రిజిస్టర్ నిర్వహించదలిచారు. ఎన్నిగంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉన్నారో నమోదు చేయించదలిచారు. సీనియర్ అధికారులు సైతం అడవులకు అనుబంధంగా ఉండే గ్రామాలలో బసచేయాలనే నిబంధనలు సూచించారు.
- అడవులకు అనుబంధమైన గ్రామాలలోని ఉత్సాహవంతులైన యువకులు, సీనియర్లను గుర్తించి అరణ్యామిత్రగా పరిగణించి గస్తీ, వన్యజీవులను బంధించే కార్యాచరణ సేవలకు వినియోగించదలిచారు.



రాష్ట్రంలో మానవ వన్యప్రాణుల సంఘర్షణ పెరిగిపోతున్న తరుణంలో వాటి నిఘాకు డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని అటవీశాఖ నిర్ణయించింది. కృపాకర - సేనాని, సంజయ్ గుబ్బి వంటి వన్యప్రాణుల నిపుణుల సలహాలను తీసుకోవాలని నిర్ణయించారు. అటవీశాఖకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని నిర్ణయించారు. పల్లె ప్రాంతాలకు సమీపంలో సంచరించే చిరుతలు, పులులను గుర్తించేందుకు 20కుపైగా డ్రోన్ కెమెరాలను సిద్ధం చేయనున్నారు. తద్వారా మానవ సంఘర్షణలు జరిపే ప్రాంతాలపై నిఘా పెట్టనున్నారు. ఏనుగుల దాడుల కూడా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేసేందుకు 8 కుంకీ ఏనుగుల ద్వారా పర్యవేక్షణ జరపనున్నారు. ఏనుగులతోపాటు అనుభవం ఉన్న మావటీలు, అటవీ సిబ్బందిని సమకూర్చుకోనున్నారు. వన్యజీవులు ఆహారంకోసం అటవీప్రాంతాలనుంచి బయటకు వస్తున్న పరిణామాలను నిఘా ఉంచితే వాటిని కట్టడి చేయవచ్చునని



20కిపైగా డ్రోన్ కెమెరాలు సిద్ధం

అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది సంతృప్తికరంగా వర్షాలు కురిసినందున అటవీ ప్రాంతాలలో అక్కడక్కడ కొలనులు, కుంటలలో నీరు నిల్వ ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఫిబ్రవరి తర్వాత ఏనుగులకు నీరు 2-3 నెలలు కష్టం కావచ్చు. అందుకు ప్రత్యామ్నాయంగా నీటి నిల్వ ఉంచే ఏర్పాట్లు చేపట్టనున్నారు.

ఇటీవల కొన్ని నెలలుగా వన్యప్రాణులు దాడులు చేసిన ప్రాంతాలపైనే నిఘా తీవ్రతరం చేయాలని అటవీ అధికారులు నిర్ణయించారు. సంబంధిత గ్రామాలకు అనుబంధంగా 2-3 చోట్ల బోర్డులు అమర్చాలని నిర్ణయించారు. ఇక డ్రోన్ల ద్వారా నిఘా పెడితే పల్లెవైపు వన్యప్రాణులు వస్తున్నాయనే సమాచారం గుర్తించి సంబంధిత గ్రామాల ప్రజలకు క్షణాలలోనే చేరవేసే ప్రక్రియ చేపట్టనున్నారు.

దేశంలోనే అత్యధిక వన్యప్రాణులు కలిగిన రాష్ట్రం..

వన్యజీవుల సంరక్షణకు సంబంధిత ప్రాంతాలలో 24 గంటలపాటు వాహనాలు, సిబ్బంది అందుబాటులో ఉండే వ్యవస్థ కల్పించదలిచారు. వన్యజీవులు దాడి చేసినప్పుడు ఎలా వ్యవహరించాలనేది, సంబంధిత ప్రాంతాలలో ప్రజలకు చైతన్యం కల్గించనున్నారు. జిల్లాస్థాయిలో సమన్వయ పర్యవేక్షణ కమిటీలు, తాలూకాస్థాయిలో సబ్‌కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ సహకారం తీసుకోదలిచారు. ఈ సమితి తరచూ సభలు జరిపి మానవ వన్యజీవి సంఘర్షణ నియంత్రణకు పనిచేసేలా చైతన్యం కల్గించనున్నారు.

- కర్ణాటకలో 6,395 ఏనుగులు ఉన్నాయి. దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.
- 563 పులులు ఉండగా దేశంలోనే రెండోస్థానంలో ఉంది.
- 1879 చిరుతలు ఉండగా దేశంలోనే మూడోస్థానంలో ఉంది.

అత్యధికంగా మానవ హాని సంఘటనలు చామరాజనగర, కొడగు, హాసన్, మైసూరు, రామనగర జిల్లాలు ఉన్నాయి. గడిచిన మూడేళ్లతో పోలిస్తే 2024-25 సంవత్సరంలో మానవ ప్రాణహాని కేసులు 30శాతం తగ్గాయి.

బళ్లారి మేయర్‌గా గాదెప్ప



మేయర్ గాదెప్ప



ఉపమేయర్ ముబీనా

- అధిష్టానం ఆశీస్సులు ఆయనకే
- ఉపమేయర్‌గా ముబీనా
- ముండ్లూరు ప్రభంజన్, ఆసీఫ్ నామినేషన్లను విత్ డ్రా చేయించిన నేతలు
- ఓటింగ్‌లో పాల్గొన్న ఎంపీ నాసీర్, ఎమ్మెల్యేలు నారా భరత్ రెడ్డి, నాగేంద్ర

- వివరాలు 8లో



కృషిమేళాలో స్టాళ్లను పరిశీలిస్తున్న యువతులు

కృషిమేళాలో వీకెండ్ సందడి

- సందర్శకులతో కిటకిటలాడుతున్న స్టాల్స్

7



బంట్వాళలో క్రేన్ సాయంతో కారును తొలగిస్తున్న అధికారులు

దక్షిణ కన్నడ జిల్లాలో రెండు రోడ్డు ప్రమాదాలు


- ఆరుగురి దుర్మరణం

7

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

ఆదిరాజు వీరభద్రరావు (జయంతి)



తెలంగాణ ప్రాంత చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన భాషా శాస్త్రవేత్త ఆదిరాజు వీరభద్రరావు 1890 నవంబరు 16న ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరులో జన్మించారు. 'తెలంగాణ శాసనాలు' గ్రంథ ప్రచురణలో ఆయన కృషి నిరుపమానమైనది. ఆంధ్ర పరిశోధక మండలికి కార్యదర్శిగా వ్యవహరించారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో లైబ్రేరియన్‌గా, కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యునిగాను, వివిధ సంఘాలలోనూ క్రియాశీలకంగా వ్యవహరించారు. అలనాటి దక్కన్ రేడియోలో తెలుగులో తొలి ప్రసంగం చేసిన ఘనత ఆయనదే. 1973 సెప్టెంబరు 28న కన్నుమూశారు.

బీఎన్ రెడ్డి (జయంతి)



పద్మభూషణ్ పురస్కార గ్రహీత, దక్షిణాదిన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న తొలివ్యక్తి బొమ్మిరెడ్డి నరసింహా రెడ్డి (బీఎన్ రెడ్డి) 1908 నవంబరు 16న కడప జిల్లా పులివెందుల తాలూకా కొత్తపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగు సినీరంగంలో దర్శకుడు, నిర్మాత, కథ, స్క్రీన్‌ప్లే రైటర్‌గా తనదైన ప్రతిభను చాటుకున్నారు. 1951లో ఎన్టీఆర్, భానుమతిలు నటించిన 'మల్లీశ్వరి' సినిమా ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. ఆయన సినిమాలలో జానపదం, సంగీతాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. భక్తపోతన, యోగివేమన, స్వర్గసీమ, బంగారుపాప వంటి సినిమాలు రూపొందించారు. 4 జాతీయ అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. 1977 నవంబరు 8న కన్నుమూశారు.

కాంతారావు (జయంతి)



వెండితెరపై కత్తి కాంతారావుగా పేరొందిన తాడేపల్లి లక్ష్మీ కాంతారావు 1923 నవంబరు 16న అప్పటి ఉమ్మడి నల్గొండ జిల్లా (ప్రస్తుత సూర్యాపేట) కోదాడలో జన్మించారు. పౌరాణిక, సామాజిక, సాంఘికం ఇలా 400కుపైగా సినిమాలలో నటించారు. నారద, శ్రీకృష్ణ, అర్జున పాత్రలతో పేరొందారు. ప్రత్యేకించి కత్తి ఫైటింగులలో రాణించారు. కొన్ని సినిమాలకు నిర్మాతగా వ్యవహరించారు. లవకుశ సినిమాలో లక్ష్మణుడు పాత్రతో గుర్తింపు పొందారు. ఉత్తమ నటుడిగా 1963లో రాష్ట్రపతి అవార్డు, ఇంకా రఘుపతి వెంకయ్య అవార్డు, నంది అవార్డు, మహానటి సావిత్రి అవార్డు, సీహెచ్ నారాయణరావు అవార్డు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2009 మార్చి 22న కన్నుమూశారు.

పుల్లెల గోపీచంద్ (పుట్టినరోజు)



జాతీయస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, 'పద్మభూషణ్' గ్రహీత పుల్లెల గోపీచంద్ 1973 నవంబరు 16న ప్రకాశం జిల్లా నాగండ్లలో జన్మించారు. ప్రస్తుతం ఇండియన్ నేషనల్ బ్యాడ్మింటన్ టీమ్‌కు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. 2001లో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ విజేత. అంతేకాక సొంత బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసి సైనా నెహ్వాల్, పీవీ సింధు, సాయి ప్రణీత్, పారుపల్లి కశ్యప్, శ్రీకాంత్ కిడాంబి వంటి ప్రతిభావంత క్రీడాకారులను దేశానికి అందించారు. పద్మశ్రీ, అర్జున అవార్డు, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య వంటి కీలక పురస్కారాలు అందుకున్నారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 2001లో విజేతగా నిలిచారు. ప్రకాశ్ పదుకొనె తర్వాత రెండో భారతీయ క్రీడాకారుడిగా రికార్డు సాధించారు.



మేళాలో ఏర్పాటైన బొగ్గులపొయ్యి



పశుగ్రాసం కట్టర్

కృషిమేళాలో వీకెండ్ సందడి

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే)లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన కృషి మేళాలో విద్యార్థులు. నగరవాసులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వారాంతం కావడంతో శనివారం సందర్శకులు పోటెత్తారు. బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి విద్యార్థులు ప్రదర్శనను చూసేందుకు వచ్చారు. జిల్లాస్థాయిలో వివిధ పంటలు ఆదర్శంగా సాగు చేసిన ఉత్తమరైతులను సత్కరించారు. కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాలకు చెందిన యువరైతు, మహిళా రైతు విభాగాలలో ప్రదానం చేశారు. సూర్యకాంతితోపాటు పంటల నమూనాల వద్ద ఫోటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. వృక్షమాతగా పేరొందిన పద్మశ్రీ గ్రహీత సాలుమరద తిమ్మక్కకు కృషిమేళా వేదికపై నివాళులు అర్పించారు. ఆమె విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఒక సాధనగా చెట్లు పెంచి ఎంతోమందికి తిమ్మక్క ఆదర్శప్రాయురాలు అయ్యారన్నారు. పట్టుపురుగుల విభాగం నమూనాలను తిలకించేందుకు ఆసక్తి చూపారు. ఆదివారంతో కృషిమేళా ముగియనుంది.



వృక్షమాత సాలుమరద తిమ్మక్క విగ్రహానికి నివాళి



మేళాలో పశువుల ప్రదర్శన



స్టాల్‌లో కీటకాలు, పట్టుపురుగుల విభాగం



సెల్ఫీ తీసుకుంటున్న ఫ్యామిలీ

మొక్కల సంరక్షణపై చిన్నారులకు చైతన్యం ముఖ్యం

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పట్ల పిల్లల్లో అవగాహన కల్పించాలని, విత్తనాలు మొక్కలు వారి ద్వారా నాటిస్తే మరింత ఆలోచన పెంపొందించినట్టు అవుతుందని పర్యావరణ వేత్త ఎల్లప్పరెడ్డి అభిప్రాయపడ్డారు. ఏక్యా గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం ఏక్యా వన ఫైండ్ ఉత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఎల్లప్పరెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం విషయంలో పిల్లలకు బోధనలకే పరిమితం చేస్తున్నారని అలా కాకుండా విత్తనాలు వేయడం, మొక్కలు నాటడం వారి ద్వారానే జరిపించే విధానం సంతోషకరమన్నారు. ఏక్యా పాఠశాల ఫౌండర్ డాక్టర్ త్రిస్తా రామమూర్తి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వన్యజీవి అధ్యయన కేంద్రం గౌరవ డైరెక్టర్ ఉల్లాస్ కారంత్, సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ కేసీ రామమూర్తి, సవితా రామమూర్తితోపాటు చిన్నారులు పాల్గొన్నారు.



ఏక్యా వన ఉత్సవంలో పర్యావరణ వేత్త ఎల్లప్పరెడ్డి తదితరులు

గ్రామపంచాయతీ అధ్యక్షురాలికి పురస్కారం



పురస్కారంతో సన్మానం

దొమ్మసంద్ర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరునాడరత్న పురస్కార గ్రహీత హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డిని గ్రామంలో ఆత్మీయంగా సత్కరించారు. పంచాయతీ అధ్యక్షురాలిగా సవితా బాబురెడ్డి గెలుపొందాక ప్రజారంజక పథకాలు అమలు చేస్తున్నారు. హాలనాయకనహళ్ళి పరిధిలోని గ్రామాలలో చెత్తరహిత పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశారు. ఇంటింటికీ చెత్తబుట్టలు అందచేశారు. 2,500 అడుగుల విస్తీర్ణంలో చెత్త సంస్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్మశానంలో విశ్రాంతి ధామ నిర్మాణ, గ్రామంలో హైటెక్ బస్టాండ్, క్లాక్‌టవర్, స్కూల్ బిల్డింగ్, శౌచాలయ నిర్మాణం, డిజిటల్ లైబ్రరీ, జన ఔషధి కేంద్రం, అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫాం, స్కూళ్లలో స్మార్ట్ తరగతులు వంటివి చేపట్టారు. ఇలా గ్రామంలో పలు రకాల విభాగాలలో సాధనలు చేయడంతో కర్ణాటక సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో సాధకులకు కరునాడ రత్న పురస్కారాన్ని అందచేసి గౌరవించారు.

విద్యార్థులలో సేవాభావం పెరగాలి

» ఎంఆర్ సీతారాం పిలుపు

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సేవాభావం పెరగాలని ఆ దిశగా యువత ఆలోచించాలని గోకుల ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎంఆర్ సీతారాం అభిప్రాయపడ్డారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలు, సేవాభావం ఉండాలన్నారు. ఈ ఆలోచనలను యువత ప్రారంభించి జీవితకాలం కొనసాగించాలన్నారు. విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో పాల్గొనడం ద్వారా సమాజం గురించి తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. ముఖ్యులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు, సీఈఓ డాక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథ్, అడ్వైజర్ డాక్టర్ కరిసిద్దప్ప, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పుట్టబోరేగౌడతోపాటు పలువురు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ శిబిరంలో 500మంది పాల్గొన్నట్టు తెలిపారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రముఖులు

బాలల సంతతో వ్యవహారిక జ్ఞానం

బంగారపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో వ్యవహారిక జ్ఞానాన్ని పెంచేదిశగా బాలల సంత వంటివి దోహదపడతాయని నవచేతన విద్యాసంస్థ కార్యదర్శి రామకృష్ణప్ప తెలిపారు. పట్టణంలోని నవచేతన విద్యాసంస్థ పాఠశాలలో ఆహారమేళా, బాలల సంత శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వస్తువులను కొనుగోలు చేసి మాట్లాడుతూ స్వావలంబనపై అవగాహన కోసం దోహదపడతాయన్నారు. లావాదేవీలు, వ్యవహార విధానం, శ్రమ ప్రాధాన్యత, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంచేందుకు బాలల సంత దోహదపడుతుందన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, విద్యాసంస్థ అధ్యక్షుడు రవికుమార్, ఉపాధ్యక్షులు నాగరాజ్, కోశాధికారి రామచంద్ర, మంజునాథ్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆహరమేళాలో కొనుగోలు

ప్రాణం తీసిన సెల్ఫీ

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సెల్ఫీ తీసుకునే వేళ ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి. అలాగే చిక్కమగళూరు జిల్లాలోని ఓ జలపాతం వద్ద సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన యువకుడు కాలుజారి మృత్యువాత చెందాడు. చిక్కమగళూరు నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీఈ చదువుతున్న వరుణ్‌దేశాయి (19) చిక్కమగళూరు తాలూకా మల్లేనహళ్ళి సమీపంలోని కామేనహళ్ళి జలపాతానికి శుక్రవారం సాయంత్రం నలుగురు స్నేహితులతో కలసి వెళ్లాడు. ఈ సందర్భంగా జలపాతం వద్ద అవగాహన లేకుండా సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించి కాలుజారి కిందపడి మృతి చెందాడు. విషయాన్ని స్నేహితులు స్థానిక పోలీసులకు తెలిపారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకున్నారు. వరుణ్‌దేశాయి అకస్మిక మృతితో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

దక్షిణ కన్నడ జిల్లాలో రెండు రోడ్డు ప్రమాదాలు

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా పరిధిలో రెండు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు దుర్మరణం చెందారు. బంట్వాళ, మంగళూరు తాలూకాలలో ప్రమాదాలు జరిగాయి. బంట్వాళ తాలూకా బీసీ రోడ్డు సర్కిల్‌లో చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. బెంగళూరు నుంచి ఇన్నోవా కారులో ఉడుపి శ్రీకృష్ణ దర్శనానికి బయల్దేరారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు కారు బీసీ రోడ్డు ఎస్‌జీ సర్కిల్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బెంగళూరు పీణ్యాకు చెందిన రవి (64), రమ్య (23), నంజమ్మ (75)లు మృతి చెందారు. ఇదే ప్రమాదంలో కీర్తి, సుశీల, బిందు, ప్రశాంత్ అనే నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సర్కిల్‌ను ఢీ కొన్నధాటికి కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. బంట్వాళ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాగా మరో ప్రమాదంలో మంగళూరు తాలూకా పణంబూరు జంక్షన్‌లో మంగళూరు వైపునుంచి వస్తున్న గ్యాస్‌ట్యాంకర్ ముందు ఆవు అడ్డు రావడంతో సడెన్‌గా బ్రేక్ వేసి నిలిపారు. గ్యాస్‌ట్యాంకర్ వెనుక వస్తున్న ఆటో కూడా అప్రమత్తమై నిలిపివేశారు. ఆటో వెనుక వస్తున్న ఇన్నోవా కారు డ్రైవర్ కూడా అప్రమత్తమయ్యాడు. ఈ సంఘటనతో మూడు వాహనాలు అత్యవసరంగా బ్రేక్‌లు వేసినా ఎటువంటి ఇబ్బంది కలగలేదు. వెనుకనుంచి వస్తున్న మరో గ్యాస్ ట్యాంకర్ ముందుగా ఇన్నోవా కారును ఢీ కొట్టింది. అయితే ఆ ధాటికి కారు ఎడమవైపు వెళ్లిపోయింది. అదే వేగంతో గ్యాస్‌ట్యాంకర్ ఆటోను ఢీ కొనడంతో రెండు వాహనాల మధ్య చిక్కుకుని ఆటో డ్రైవర్ మహ్మద్ కుంజి (25)తోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న అబుబకర్ (65), ఇబ్రహీం (68)లు మృతి చెందారు. వీరు మంగళూరులోని కోణాజెమొంటెపదవు ప్రాంతానికి చెందినవారు. మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని మంగళూరు నగర పోలీస్ కమిషనర్ సుధీర్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అర్థవంతంగా కన్నడ రాజ్యోత్సవం

విజయపుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రగతి హైస్కూల్‌లో కన్నడ రాజ్యోత్సవం, బాలల దినోత్సవ కార్యక్రమాన్ని అర్థవంతంగా ఆచరించారు. కార్యక్రమంలో భాగంగా సాలుమరద తిమ్మక్కకు నివాళులు అర్పించారు. పిల్లల్లో చదివే అలవాటు పెంపొందించాలని వక్తలు పేర్కొన్నారు. పిల్లల్లో దాగిన ప్రతిభను ప్రోత్సహించాలన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ బసవరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆలయాలు సంస్కారాన్ని బోధించే కేంద్రాలు



గోపూజలో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలయాలు కేవలం ధార్మిక కేంద్రాలే కాకుండా సంస్కారాన్ని బోధించే కేంద్రాలుగా ఉన్నాయని మాజీ మంత్రి అరవింద లింబావళి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఇమ్మడిహళ్ళిలో నిర్వహించిన యల్లమ్మదేవి నూతన స్థిరబింబ ప్రతిష్ఠాపన, నూతన దేవాలయం, విమానగోపురం, కళశస్థాపన, మహాకుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్నారు. గోపూజ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయాలలో జరిగే ఆచారాలు, వ్యవహారాలు, పూజా విధానాలు మన సంస్కృతిని కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఆలయాల సందర్శన ద్వారా మనలో సకారాత్మక భావనలు పెరుగుతాయని తద్వారా మానసిక ప్రశాంతత సాధ్యమన్నారు. ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. వేలాదిమంది భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్న సంతర్పణ చేశారు. ఉత్సవంలో ప్రణవానందపురిస్వామి, కుబేరప్పతాతయ్య, ఆలయ ప్రముఖులు హనుమంతేగౌడ, బీ నారాయణస్వామి, కృష్ణమూర్తి, కృష్ణప్ప, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచాలి : సీఈఓ



జడ్పీ సీఈఓ నవీన్‌భట్ తదితరులు

శిడ్లఘట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హండిగనాళ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు. ముఖ్యఅతిథిగా జడ్పీ సీఈఓ నవీన్‌భట్ పాల్గొని మాట్లాడుతూ బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చేబాధ్యత, బాలల హక్కుల రక్షణ మనపై ఉందన్నారు. అప్పుడే ఉత్తమ సమాజం సాధ్యమన్నారు. తమ సమస్యలను నిర్భయంగా అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట ధైర్యంగా చెప్పగలిగేలా పిల్లలను తీర్చాలన్నారు. బాలల సమస్యల పరిస్కారానికి తగిన చొరవ చూపాలన్నారు. బాలల రక్షణా విభాగం మంజునాథ్ మాట్లాడుతూ 18ఏళ్లలోపు పిల్లల మానసిక, శారీరక స్థైర్యం కల్పించడంతోపాటు వారి హక్కుల గురించి అవగాహన కల్పించేందుకు హెల్ప్‌లైన ఉందన్నారు. జడ్పీ ముఖ్య కార్యదర్శి మునిరాజు, పీడీఓ మధు, తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి, హండిగనాళ గ్రామపంచాయతీ అధ్యక్షులు వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ నియంత్రణపై వాకథాన్



వాకథాన్‌కు పచ్చజెండా

మహదేవపుర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధుమేహ నియంత్రణపై అవగాహన కల్పించేలా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉదయం వాకథాన్ జరిగింది. కేఆర్‌పురం ప్రాంతంలోని ఎస్ఈఏ కాలేజ్, నల్పాడ్ బెల్లహళ్ళి కాలేజ్ విద్యార్థులతోపాటు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వెయ్యిమందికిపైగా పాల్గొన్నారు. కన్నడ బుల్లితెర నటి భవ్యా గౌడ, మెడికవర్ ఆసుపత్రి శాఖాధిపతి కృష్ణమూర్తి వాకథాన్‌కు పచ్చజెండా చూపారు. డయాబెటాలజిస్ట్ డాక్టర్ రాజ్ సెల్వరాజన్ మాట్లాడుతూ దేశంలో మధుమేహ బాధితులు క్రమేపీ పెరుగుతున్నారని, దీని నియంత్రణ, ఆరోగ్య సవాళ్ల గురించి అవగాహన కల్పించేలా వాకథాన్ చేపట్టినట్టు తెలిపారు. నియమిత ఆరోగ్య పరీక్షలు, తగిన జీవనశైలి, సమయానికి చికిత్సలు పొందడం ద్వారా మధుమేహం నియంత్రణలో ఉంటుందన్నారు. మెడికవర్ ఆసుపత్రి నుంచి హూడి మెట్రో స్టేషన్ వరకు వాకథాన్ సాగింది. వాకథాన్‌లో డాక్టర్ శృతి, సమర్పితా దత్తచౌదరి తదితరులు పాల్గొన్నారు.

25కు చేరిన మైసూరు జీఐ పోర్ట్‌ఫోలియో



ఎంపీ యదువీర్ తదితరులు

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతి ఎక్కువ ప్రాంతీయ సంరక్షిత ఉత్పత్తులలో 25కు మైసూరు జీఐ పోర్ట్‌ఫోలియో చేరినట్టు ఎంపీ యదువీర్ అభిప్రాయపడ్డారు. ఎఫ్‌కేసీసీఐలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షులు ఉమారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ సాయిరాం ప్రసాద్, టీపీ శశిధర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మైసూరుపాక్, మైసూరు సిల్క్, మైసూరు శాండల్‌సోప్ ఇలా భౌగోళిక సూచిక (జీఐ) 25 ఉత్పత్తులలో గుర్తింపు సాధించిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత భారత్ దృష్టికోణంతో మేక్ ఇన్ ఇండియాకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కర్ణాటక ఏర్పాటు, రాష్ట్ర రూపకల్పనలో వ్యక్తులు, సంస్థల ప్రాధాన్యతను వివరించారు. అందులో ఎఫ్‌కేసీసీఐ కూడా సాధనా సంస్థ అని కొనియాడారు. విభిన్నరంగాల సాధకులలో మాజీ ఐఏఎస్ డాక్టర్ సోమశేఖర్, నిమ్హాన్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతిమామూర్తి, సంగీత విభాగంలో గురురాజ్ హొస్కోటె, జానపదంలో బీ మునిరాజుతోపాటు పలువురిని సత్కరించారు. ఎయిర్ అంబులెన్స్ సర్వీస్ ఫౌండర్ డైరెక్టర్ శాలిని నల్వాడ్ పాల్గొన్నారు.

కార్తీకమాసం కోసం మీనా బజార్



కళాఖండాల ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో చివరి సోమవారం ప్రత్యేక పండుగ చేసుకునే సంప్రదాయం ఉంది. ఇందులో భాగంగానే ఇంటి అలంకరణలు, దీపాలతోపాటు వివిధ రాష్ట్రాల కళాఖండాల ప్రదర్శనను మీనా బజార్ పేరిట ఏర్పాటు చేశారు. ప్రముఖ వీడియో క్రియేటర్ సంతోషి మేఘరాజ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రత్యేకంగా ఉండే గాజులు, శీతాకాలంలో అవసరమైన దుప్పట్లు, అందమైన బొమ్మలు చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న హిందూస్థాన్ ఫైల్స్ ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కోల్కత్తాకు చెందిన విరాసత్ ఆర్ట్ భారత చరిత్రకు సంబంధించి హిందూస్థాన్ ఫైల్స్ చిత్ర ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన చిత్రాలలో 1757 - 1950 మధ్య సేకరించిన అరుదైన కళాఖండాల ప్రదర్శన ఉంది. పెయింటింగ్, ఫోటోగ్రాఫ్స్, లేఖలు, అధికారిక రికార్డులు, చారిత్రాత్మక బొమ్మలు ప్రదర్శింపచేశారు. ఎవల్యూషన్ ఆఫ్ బ్రిటీష్ ఇండియాలో కొనసాగిన అబ్బురం అనిపించే కళాఖండాలు ఉన్నాయి.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.73	1631.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,725	2,253
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,526	8,916
నీటి నిల్వ (టీఎంసీలు)	75.61	98.61



కారును తొలగిస్తున్న అధికారులు

బస్సు, కారు ఢీ.. నలుగురికి గాయాలు

బళ్లారిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : బస్సు, కారు ఢీ కొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. బళ్లారి రూరల్ తాలుకాలోని పరమ దేవనహళ్లి వేద వతి నది వంతెనపై శనివారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బళ్లారి పేం,ఇ అనంతపురం వైపు వెళుతున్న బస్సు గుంతకల్లు నుంచి బళ్లారి వైపు వెళుతున్న కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. కారు నడుపుతున్న మహబూబ్ బాషా (30) తీవ్రంగా గాయపడటంతో పాటు వారి స్నేహి తులు షేక్ నసీమా భాయ్, స్వల్పంగా గాయపడ్డారు. వీరిని బళ్లారి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై పీడీహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

రాయచూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగర సమీపంలోని హైదరాబాద్ రోడ్డు బాలాజి పత్తి మిల్లులో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిల్లులో 12వేల క్వింటాళ్ల పత్తిని సేకరించి ఉంచగా నిప్పంటుకుని పొగలు వచ్చాయి. వెంటనే అక్కడికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది దాదాపు 4-5 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 700 క్వింటాళ్ల వరకు పత్తి కాలిపోయినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. వ్యాపారి బెల్లం జైపాల్‌కు చెందిన ఈ మిల్లులో ప్రమాదం చోటు చేసుకున్నట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.



కాలి బూడిదయిన పత్తి

బళ్లారి మేయర్‌గా గాదెప్ప



విజేతలను అభినందిస్తున్న ఎంపీ నాసీర్ హుసేన్, ఎమ్మెల్యేలు నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ అల్లం ప్రశాంత్

బళ్లారి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ఉత్కంఠ రెకెత్తించిన బళ్లారి మహనగర పాలికె మేయర్, ఉప మేయర్ ఎన్నికలు ఎట్టకేలకు హైడ్రామా మధ్య ప్రశాంతగా శనివారం ముగిసాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఆశీస్సులు పి. గాదెప్పకు ఉండడంతో ఆయనకే పీఠం అందజేశారు. ఉప మేయర్‌గా ముబీనా విజయం సాధించారు. బళ్లారి మహనగర పాలికె మేయర్, ఉపమేయర్, నాలుగు స్థాయి సమితి సభ్యులకు శనివారం ఎన్నికలు జరిగాయి. కలబు రిగి రీజనల్ అధికారి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మేయర్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి 23వ వార్డు కార్పొరేటర్ పి. గాదెప్ప, 3వ వార్డు కార్పొరేటర్ ముండ్లూరు ప్రభంజన్, 23వ వార్డు కార్పొరేటర్ పి. గాదెప్ప, 30వ వార్డు కార్పొరేటర్ ఆసీఫ్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నుంచి 10వ వార్డు కార్పొరేటర్ కోనంకి తిలక్ ఒక్కరే నామినేషన్ వేశారు. ఉపమేయర్‌గా కాంగ్రెస్ పార్టీ నుండి ముబీనా, మరో ఇద్దరు నామినేషన్ వేశారు. బీజేపీ నుండి కూడా ఇద్దరు నామినేషన్ దాఖలు చేశారు. మేయర్ పదవికి కాంగ్రెస్ నుంచి ముగ్గురు నామినేషన్ వేయడంతో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. ఆసీఫ్‌ను ఎలాగోలా విత్‌డ్రా చేయించారు. కానీ ప్రభంజన్‌ను విత్‌డ్రా చేయించేందుకు పార్టీనేతలు చాలా కష్టపడ్డారు. ఎట్టకేలకు నామినేషన్‌ను విత్‌డ్రా చేయించారు. దీంతో మేయర్ గా గాదెప్ప, ఉపమేయర్‌గా ముబీనా ఎన్నికయ్యారు. బీజేపీ నుంచి కోనంకి తిలక్, ఉపమేయర్‌గా కల్పన రంగంలో నిలిచారు. బీజేపీ కార్పొరేటర్ల 13 మంది, కాంగ్రెస్ కార్పొరేటర్ల 26 మంది, 39 మంది ఇద్దరు ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి బి. నాగేంద్ర, ఎంపీ నసీర్ హుసేన్ ఓట్లుతో మొత్తం 42 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి కోనంకి తిలక్‌కు 13 ఓట్లు, బీజేపీ ఉపమేయర్ కల్పనకు 13 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థి పి. గాదెప్పకు 28 ఓట్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ నుండి మేయర్ పదవి ఆశించి విత్‌డ్రా చేసుకున్న ప్రభంజన్ ఏ అభ్యర్థికి ఓటు వేయకుండా తటస్థంగా ఉన్నారు. ఎన్నికల అధికారి చేతులు పైకి ఎత్తే పద్ధతి ద్వారా ఓటింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన విజేతల వివరాలను ప్రకటించారు. మేయర్, ఉపమేయర్‌లకు పలువురు పార్టీనేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకే మేయర్, ఉపమేయర్ అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు.



నామినేషన్ ఉపసంహరణకు ప్రభంజన్‌ను ఒప్పిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుల చేతిలో పిల్లల భవిష్యత్తు : న్యాయాధికారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పిల్లలను దేశ భవిష్యత్తు శిల్పులుగా తీర్చిదిద్దడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారుల బాధ్యత అని న్యాయయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసాన్ని పురస్కరించుకుని జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, జిల్లాన్యాయసేవల ప్రాధికారసంస్థ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం,బాలల సంక్షేమ కమిటీ, ప్రభుత్వ బాలల సంరక్షణ సంస్థల సహకారంతో నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని శాంతిదామ్ ప్రాంగంణంలో శనివారం నిర్వహించిన బాలల దినోత్సవం నామకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని ప్రతి బిడ్డకు ప్రేమ,భద్రత,విద్యనుఅందించడమే బాలల దినోత్సవ ఉద్దేశమన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారిణి సుభద్రాదేవి ప్రారంభోపన్యాసం చేస్తూ, పిల్లలు పువ్వుల వంటివారని వారు వాడిపోకుండా జాగ్రత్త వహించాలని, పిల్లల హక్కులు, సంరక్షణ ,విద్య గురించి అవగాహన కల్పించాలని అన్నారు. బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ త్రివేణి పత్తార్ మాట్లాడుతూ పిల్లలు స్వేచ్ఛగా నమ్మకంగా ఎదగడానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడానికి ప్రోత్సహించాలని అన్నారు. ప్రతిబిడ్డ నేర్చుకోవడానికి పెరగడానికి అనుకూలమైన వాతావరణాన్ని అందించాలన్నారు. ఈసందర్భంగా బాలల కమిటీ సభ్యులు చాట్లవెంకటేశ్,గౌసియా,బాలల సంరక్షణ సంస్థల సూపరింటెండెంట్ నాగవేణి,గురుబసవరాజు,హాలుగప్ప, జిల్లా బాలల రక్షణ యూనిట్ ,బాలల హెల్ప్‌లైన్ ,బాలల సంరక్షణ అధికారి మంజునాథ్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి

చిలమత్తూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల పరిధిలోని 544-ఈ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో మరవకొత్తపల్లి బీసీ కాలనీ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి చెందాడు. మరవకొత్తపల్లి బీసీ కాలనీలో ఉన్న విరాట్ ప్యాలెస్ కల్యాణమంటప ప్రాంగణం నుంచి అంజినప్ప తన ద్విచక్రవాహనంలో రోడ్డుపైకి వస్తుండగా అదే సమయంలో చిలమత్తూరు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వైపు వేగంగా వచ్చిన బొలేరో ఢీకొంది. ప్రమాదంలో అంజినప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని డ్రైవర్ అక్కడే ఆపేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నామన్నారు.

మద్దతు ధరతో జొన్న, రాగి కొనుగోలు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మద్దతు ధర పథకం క్రింద ప్రస్తుతం ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో పండించిన చిరుధాన్యాలైన రాగి, జొన్న ఉత్పత్తులను రైతుల నుండి నేరుగా ఖరీదు చేయనున్నట్లు జిల్లా టాస్క్ ఫోర్స్ సమితి మెంబర్ సెక్రటరీ పౌర ఆహార సరఫరా, వినియోగదారుల శాఖ అసిస్టెంట్‌డైరెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చిరు ధన్యాలు సాగు చేసే రైతులకు ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. చిరు ధాన్యాలు సాగు చేసే రైతులు మొదటగా వ్యవశాయ శాఖ ఫ్రూట్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయా తాలూకాల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్, తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సహకార సంఘం, ప్రాథమిక వ్యవసాయ పత్తిన సహకార సంఘం, కేంద్ర కార్యాలయాల్లో కొనుగోలు కేంద్రాలో రాగి, జొన్న ఉత్పత్తులను అమ్మడానికి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం తెల్ల హైబ్రిడ్ జొన్న ప్రతి క్వింటాళకు రూ 3699లు, మాల్దండి తెల్ల జొన్న క్వింటాలుకు రూ 3749, రాగి క్వింటాల్‌కు రూ 4886లు, సిరిధాన్యాలైన కొర్రలు క్వింటాల్‌కు రూ 4886లు నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తిగల రాగి పండించే రైతులు డిసెంబరు 15వ తేదీ పేర్లు నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు, 2026 జనవరి 1వ తేదీ నుండి మార్చి 31వ తేదీ వరకు కొనుగోలు చేస్తున్నట్లు, . అదేవిధంగా జొన్న ఉత్పత్తులు అమ్మదలిచే రైతులు మార్చి 31వరకు పేర్లు నమోదుకు అవకాశం కల్పిస్తున్నట్లు, 2026 జనవరి 1వ తేదీ నుండి ఏప్రిల్ 30వ తేదీ వరకు రైతుల నుండి కొనుగోలుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలలిపారు. మధ్యవర్తుల ద్వారా, ఏజెంట్‌ల ద్వారా ఖరీదు కేంద్రాలకు రాగి, జొన్న ఉత్పత్తులను తీసుకొస్తే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 8867271187, 97406703, 900884164 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



కలెక్టర్ కవితా మన్నికేరి

బళ్లారి సిటీ (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా టాస్క్ ఫోర్స్ చైర్మన్ జిల్లాకలెక్టర్ కవితా మన్నికేరి కనీస మద్దతు ధర పథకం కింద 2025-26 సంవత్సరానికి ఆహార ధాన్యాల సేకరణకు షెడ్యూల్డ్ కొనుగోలు ధరను నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరి ధాన్యం మిల్లెట్,తెల్లజొన్న కోసం నిర్ణయించిన నిబంధనల ప్రకారం వర్షాకాలలో రైతుల నుండి నాణ్యమైన ఆహార ధాన్యాలను నేరుగా కొనుగోలు చేయడానికి ధరలు నిర్ణయించబడ్డాయి. ప్రతి రైతు నుండి ఎకరానికి 25క్వింటాళ్లకు రూ.2369 చొప్పున గరిష్ఠంగా 50క్వింటాళ్ల వరకు మార్చి 31వరకు రూ.4,886 ధరకు చిరుదాన్యాలు,చిన్న ధాన్యాలు ,జొన్నలు కొనుగోలు చేయాలని ఆమె ఆదేశించారు. మరిన్ని వివరాల కోసం హొస్పేట తాలూకా 74831 84576, హగరిబొమ్మనహళ్ళి తాలూకాలో 99002 36100, కూడ్లిగి తాలూకా 96320 32224, కొట్టూరు7829626177, హరపనహళ్ళి 77603 10203, అరసికెరె 77690 014043 నంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

నేడు ఆరోగ్యశిబిరం

కంప్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంగావతిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవంలో భాగంగా డయాబెటిస్ స్క్రీనింగ్ అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానికి హుబ్బళ్లి నుండి ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్ సత్తూరుతో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం ఐఎంఏహాళ్ జరుగబడుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత రక్తపరీక్ష చేపడతారన్నారు డాక్టర్ మల్లన్న గౌడ, పోలీసు పాటిల్, అధ్యక్షులు డాక్టర్ నాగరాజు లోక్రే, డాక్టర్ భానుప్రతాప్ హోసకేరి, డాక్టర్ కే అరవింద్, డాక్టర్ శివకుమార్ మాలిపాటిల్, అధ్యక్షులు లయన్స్ క్లబ్ గంగావతి జాయింట్ సెక్రెటరీ శివప్ప, గాలిజంబన్న తెలిపారు.

విపత్తు పరిస్థితులపై అవగాహన



మాట్లాడుతున్న సహాయక జిల్లా అధికారి మహమ్మద్ జుబేదర్

కంప్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో విపత్తు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ అధికారి మహమ్మద్ జుబేదార్ తెలిపారు. శనివారం బళ్లారి థర్మల్ పవర్ స్టేషన్ కుడితినిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బళ్లారి కర్ణాటక విపత్తు నిర్వహణ అథారిటీ బెంగళూరు జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, మ్యూచువల్ ఎయిడ్ పార్టనర్స్ వేరియస్ ఇండస్ట్రీ సహకారంతో కుప్పకూలిన నిర్మాణం శోధన, రక్షణ ఆన్‌సైట్ అణు ప్రదర్శన చేపట్టారన్నారు. తమ చుట్టు ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు కనిపించిన వారి మెళకువలు గమనించాలన్నారు. ప్రతిక్షణం అప్రమత్తంగా వుంటూ ఇలాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తపడాలని అధికారులకు సూచించారు. అనంతరం విపత్తు సమయంలో అగ్నిమాపక దళాలు, పోలీసు శాఖ, ఆరోగ్య శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమంలో ఈడీ ఉదయ్ కుమార్ సిద్దరామేశ్వర వల్లం రాము ప్రసాద్ గోఖలే సురేష్ తల్వార్ మల్లికార్జున, సేఫ్టీ అధికారి ప్రకాష్, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం



ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బళ్లారిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో గల వెంకటేశ్వర నగర్‌లో వెలిసిన అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం కార్తీకదీపోత్సవం ఘనంగా నిర్వహించారు. 1008 కార్తీక దీపాలు వెలిగించి భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని భక్తాదులు పెద్దఎత్తున పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధనుంజయ తెలిపారు.

సాలుమరద తిమ్మక్కకు నివాళి

తోరణగల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ జీవితాన్ని పరిసరాల రక్షణకు త్యాగం చేసిన సాలుమరద తిమ్మక్కకు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం, సండూరు తాలుకా ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో నివాళి అర్పించారు. ఈ సందర్భగా పాల్గొన్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం మాట్లాడుతూ మన దేశ పరిసర రక్షణకు సాలు మరద తిమ్మక్క తమ జీవితాన్ని త్యాగం చేశారని ఆమె నాటిన ప్రతి మొక్క రేపటి తరానికి ఎంతో మేలు చేస్తుందని అది జీవనాధారమని ప్రకృతిని కాపాడటమే అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

హోసూరు జోన్

ఓటరు జాబితాలో రెండుసార్లు పేర్లు

- తొలగించాలని అన్నా డీఎంకే నాయకుల డిమాండ్



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు శాసనసభ నియోజకవర్గ ఓటర్ల జాబితాల్లో 12,793 మంది ఓటర్లు పేర్లు రెండుసార్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హోసూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ మాజీ ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం, అన్నాడీఎంకే సభ్యులతో కలిసి హోసూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆకృతిశెట్టిని కలిసి ఫిర్యాదు సమర్పించారు. అనంతరం మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫిర్యాదులో హోసూరు శాసన సభ నియోజకవర్గంలో రెండుసార్లు పేర్లు నమోదైనవారు ఉన్నారని వెంటనే తొలగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. జాబితాలో నకిలీ ఓటర్లు, మరణించిన వారి పేర్లు ఉన్నాయని వెంటనే తొలగొంచాలని కోరామన్నారు.

18న విద్యుత్ కోత

హోసూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హోసూరు డివిజన్‌లోని కృష్ణగిరి విద్యుత్ పంపిణీ సర్కిల్‌లో 110-11 కెవి సబ్‌స్టేషన్‌లో అవసరమైన విద్యుత్ పరికరాల నిర్వహణ పనులకోసం ఈనెల 18న విద్యుత్‌కోత ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని నగరంలో శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. టి.వి.ఎస్ నగర్, అందివాడీ, మత్తిగిరి, టైటాన్ టౌన్‌షిప్, గాడిపాళ్యం, పాతమత్తిగిరి, ఎడేనల్లూరు, శివకుమార్ నగర్, కొత్తూరు, కొత్తగొండపల్లి, బొమ్మండపల్లి, మునీశ్వరనగర్, ఆదవన్ నగర్, ద్వారకనగర్, మత్తమ్, న్యూహడ్కో, రామనగర్, బస్టాండు, శ్రీనగర్, అప్పావునగర్, కామరాజ నగర్ కాలనీ, అన్నానగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్‌లైలాండ్, 1 సిప్‌కాట్ హౌసింగ్‌కాలనీ, నేతాజీరోడ్డు, బాలాజీ నగర్ (చిన్నయళసగిరి) ఆనందనగర్, శాంతపునం, అరసనట్టి, సూర్యనగర్, బృదావన్‌నగర్, అన్నామలై నగర్, కృష్ణానగర్, ఎంజీరోడ్డు, అలసనత్తం, నరసింహ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలన్నారు.

జిల్లావ్యాప్తంగా వైద్య శిబిరాలు

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఆదేశాలతో కృష్ణగిరి జిల్లాలోని 10 బ్లాక్‌లలో 30 వైద్య శిబిరాలు జరిగాయి. శనివారం కార్పొరేషన్ పరిధి సహా 33 వైద్య శిబిరాలు కొనసాగాయి. ఇప్పటివరకు కృష్ణగిరి జిల్లాలోని 14 ప్రాంతాలలో హోసూరు కార్పొరేషన్, బాగలూరు తళి, కెలమంగలం, అలపట్టి, శూలగిరి, వేప్పనపల్లి, బర్గూరు, మద్దూరు, సింగారపేటై, ఊత్తంగరై, సామల్‌పట్టి, కావేరిపట్టణంలో (నలం కాకుం స్టాలిన్) వైద్య శిబిరాలు జరిగాయి. శనివారం పోచ్చంపల్లి ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రాంగణంలో (నలం కాకుం స్టాలిన్) పథకం క్రింద వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో స్పెషలిస్ట్ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీకి మెడికల్ కన్సల్టేషన్, ఆర్థోపెడిక్స్ ప్రసూతి, గైనకాలజీ పీడియాట్రిక్స్, కార్డియాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ, డెంటీస్ట్రీ, అప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, మానసిక ఆరోగ్యం, రక్త పరీక్షలు వంటి 17 రకాల స్పెషలిస్ట్ వైద్యులు ప్రజలకు వైద్యం అందించారు. గర్భిణీలకు అవసరమైన స్కాన్ పరీక్షలు, ఎక్స్‌రే, ఈసీజీ, ఈసీహెచ్‌ఓ, అల్ట్రా సౌండ్, కంటి పరీక్షలు, అధిక రక్తపోటు, మూత్రపిండాల పరీక్షలతోపాటు ఆసక్తిగలవారికి సిద్ధ వైద్యం కూడా అందించారు. శిబిరంలో 1,842 మంది పేర్లు నమోదు చేసుకుని చికిత్సలు పొందారు. అవసరమైన మందులు, మాత్రలు అందించారు. ముఖ్యమంత్రి సమగ్ర వైద్య బీమా పథకం క్రింద వైద్య చికిత్స కోసం సూచించారు. తదనంతరం బర్గూరు ఎమ్మెల్యే కార్మికుల సంక్షేమం తరపున 46 వైకల్య గుర్తింపు కార్డులు, 3 భవన నిర్మాణ కార్మికుల నెలవారీ పెన్షన్ ఆర్డర్‌లను జారీ చేశారు, కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి రమేశ్, వికలాంగుల సంక్షేమ అధికారి మురుగేశన్, నాగోజనపల్లి పట్టణ పంచాయతీ చైర్మెన్ తంబిదురై, జిల్లా వైద్య అధికారులు శివకుమార్, రంగస్వామి, ఇనియల్ మండోదరీ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అధిక లాభాలతో దానిమ్మ రైతు హర్షం



అంకసముద్ర గ్రామంలో దానిమ్మ పండ్లను మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు

బళ్లారి సిటీ,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హగరిబొమ్మనహళ్ళి రైతులు దానిమ్మ సాగుతో అధిక లాభాలు గడిస్తున్నారు. గత సంవత్సరం ధర లేక నష్టాలపాలయ్యామని, ఈ ఏడు దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉన్నాయని అన్నదాత హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాలూకాలోని మొత్తం 2,160హెక్టార్లలో బగావా రకం దానిమ్మపండ్లు సాగు చేశారు. 35,000 టన్నుల దిగుబడి సాధ్యమయ్యింది. కిలో దానిమ్మ రూ. 150 నుంచి రూ. 90వరకు పలుకుతోంది. తాలూకాలోని హంపసాగర్,ఎనిగి బసాపుర,కోడిహళ్ళి ,బాచిగొండనహళ్ళి, అంకసముద్రం,గడ్డికేరి,మరబ్బిహాలు సహా పలు గ్రామాల్లో రైతులు దానిమ్మపండించారు. ఈసారి హెక్టారకు 20నుంచి 22 టన్నుల దిగుబడి ఇచ్చిందని బాచిగొండనహళ్ళి రైతు కొట్రప్పతెలిపారు. బెంగళూరు, ముంబై, కోల్‌కతా, చెన్నై మార్కెట్లలో ఈ ప్రాంత పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు.

బెళగామ్ కేంద్రంగా రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్ళు

- విదేశీయుల డిజిటల్ అరెస్టుకు యత్నం
- అంతర్జాతీయ స్థాయి కేసును ఛేదించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన అమెరికా లాంటి దేశ ప్రజలను టార్గెట్ చేస్తూ డిజిటల్ అరెస్టుకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాకు చెందిన 28మంది సైబర్ నేరగాళ్ళను బెళగామ్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో పురుషులు, మహిళలు చేరి మొత్తం 33మంది నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, వారిలో 5గురు మహిళలు కావడంతో వారిని విచారణ నిమిత్తం పోలీసు కస్టడీలో ఉంచగా, మిగిలిన 28మంది పురుష నిందితులను హాజరు పరిచినట్లు బెళగామ్ పోలీసులు తెలిపారు. బెళగామ్ నగరాన్ని కేంద్రంగా చేసుకుని కార్యాలయాన్ని ప్రారంభించిన సైబర్ నేరగాళ్ళు అమెరికా దేశ ప్రజలను ' డిజిటల్ అరెస్టు ' చేస్తున్నట్లు అంతర్జాతీయ స్థాయిలో నమోదైన కేసును బెళగామ్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో వివిధ రాష్ట్రాలకు చెందిన 33 మంది అరెస్టు చేయగా, వారి నుండి 37 హైటెక్ ల్యాప్‌టాప్‌లు, 37 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో అస్సాం, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మేఘాలయ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, నాగాల్యాండ్ రాష్ట్రాలకు చెందిన 32మంది కాగా, నేపాల్ దేశానికి చెందిన ఒకరు ఉన్నారు. డిజిటల్ హ్యాక్‌లో నిపుణులైన అందరూ ఒక చోట చేరి బెళగామ్ కేంద్రంగా చేసుకుని ఈ సైబర్ హ్యాక్‌కు నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. నకిలీ కాల్‌సెంటర్ ప్రారంభించిన వీరు ప్రతి ఒక్కరు రోజుకు 100 మొబైల్ ఫోన్‌కు పోన్ చేసేవాళ్ళని పోలీసుల విచారణలో తెలింది. వీరికి ఆర్థిక సహాయంగా అమెరికాలో ఒక బృందం పనిచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ బృందం ద్వారానే ఫోన్ నెంబర్ల డేటా, ఇంటి అడ్రస్సు, బ్యాంకుల వివరాలు పొందినట్లు పోలీసులు విచారణలో నిందితులు అంగీకరించినట్లు సమాచారం. నిందితులందరిని 14రోజుల పాటు కస్టడీకి అప్పగించింది.

22 నుంచి రాష్ట్రస్థాయి క్రీడలు

బళ్లారి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో వెటర్న్ అథర్టిక్స్ అసోసియేషన్ ఆఫ్ బళ్లారి, వెటర్నస్ అట్లాంటిక్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సహకారంతో ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్టేడియంలో రెండు రోజులు క్రీడలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతాబాయి తెలిపారు. బళ్లారి నగరంలో ప్రతిభ భవన్లో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 30 నుంచి వంద సంవత్సరాల వయసు గల అట్లాంటిక్ క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వంత మీటర్ల నుంచి ఐదు వేల మీటర్ల రేసు త్రోహింగ్ , జంపింగ్ ఈవెంట్లతో సహా ఐదు భాగాలతో జరుగుతుంది. 65 యేళ్ల పైబడిన పోటీదారులకు కొన్ని కార్యక్రమాలు నిషేధించబడతాయి. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు కూడా పాల్గొనవచ్చన్నారు. కూడా అవకాశాలను అందిస్తుంది. పోటీలో మొదటి, రెండవ, మూడవ బహుమతులు ఇవ్వాలని చేయబడింది. విజేతలు డిసెంబరు 13, 14 తేదీల్లో తమిళనాడులో తిరువన్నామలైలో జరిగే దక్షిణ భారత క్రీడల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్, కోశాధికారి దొడ్డయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్ అబ్దుల్ మునాఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్రీడా సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతా బాయి